
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



రాయచూరులో ఎయిమ్స్ ఏర్పాటు చేయాలి

రాయచూరు, జూలై 8 : విద్యాపరంగా అత్యంత వెనకబడిన రాయచూరు జిల్లాకు ఎయిమ్స్ మంజూరు చేసే బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని ఎయిమ్స్ పోరాట సమితి కన్వీనర్ డాక్టర్ బసవరాజ్ కళస అన్నారు. ఎయిమ్స్ కోసం అఖిల పక్షం, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక నిరాహార దీక్ష సోమవారం 788వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ స్టేడియంలోని దీక్ష శిబిరం వద్ద బసవరాజ్ కళస మాట్లాడుతూ ఎయిమ్స్ ఏర్పాటుకు సంబంధించి స్థానిక ప్రజాప్రతినిధులు ఏనాడు దీనిపై నోరు విప్పకపోవడం బాధ్యత రాహిత్యమన్నారు.

ప్రైవేట్ యూనివర్సిటీలకు బ్రేక్



- 9 కళాశాలల నుంచి అనుమతులకు దరఖాస్తు
- ఇప్పటికే రాష్ట్రంలో 27 ప్రైవేట్ యూనివర్సిటీలు
- కొరవడిన ప్రభుత్వ అజమాయిషీ
- కొత్త వాటికి ముఖ్యమంత్రి నిరాకరణ

బెంగళూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల కళాశాలలు ప్రైవేట్ యూనివర్సిటీలుగా మార్చుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలకు ముఖ్యమంత్రి సిద్దరామయ్య బ్రేక్ వేశారు. వివిధ ప్రాంతాల్లో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న కళాశాలలు యూనివర్సిటీగా మార్చుకోవాలని భావిస్తున్నాయి. ఇలా 9 కళాశాలల నుంచి అనుమతులకోసం దరఖాస్తులు వచ్చాయి. కొత్తగా ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చినప్పుడు ప్రైవేట్ యూనివర్సిటీలకు విరివిగా అనుమతులు ఇచ్చిన సందర్భాలు ఉన్నాయి. ఇలా రాష్ట్రంలో 27 ప్రైవేట్ యూనివర్సిటీలు ఏర్పడ్డాయి. ప్రైవేట్ యూనివర్సిటీల అనుమతుల కోసం 9 కళాశాలలు ఉన్నత విద్యాశాఖకు దరఖాస్తు చేసుకున్నాయి. కొన్ని కళాశాలలు ఏళ్ల తరబడి ప్రతిపాదనలు పంపగా ప్రభుత్వం అనుమతులు ఇవ్వలేదు. రాష్ట్రంలో ప్రైవేట్ యూనివర్సిటీల సంఖ్య పెరుగుతుండడంతో వీటి నియంత్రణ ప్రభుత్వానికి కష్టతరంగా మారుతోంది. ప్రస్తుతానికి అనుమతులు ఇవ్వకపోవడమే ఉత్తమమని సీఎం అభిప్రాయపడినట్టు తెలుస్తోంది. ప్రభుత్వానికి అనుబంధంగా 41 యూనివర్సిటీలు, 27 ప్రైవేట్ యూనివర్సిటీలు, 11 డీమ్డ్ టు బి యూనివర్సిటీలు ఉన్నాయి. గత కొన్నేళ్లుగా



ప్రభుత్వాలు ఏవో కారణాలతో ప్రైవేట్ యూనివర్సిటీలకు అనుమతులు ఇస్తూ వచ్చాయి. ప్రైవేట్ యూనివర్సిటీల్లో ప్రభుత్వం నియంత్రణ కోల్పోతూ వస్తోంది. ప్రభుత్వ ఆదేశాలను ప్రైవేట్ యూనివర్సిటీలు పాటించడంలేదనే విమర్శలు ఉన్నాయి. ఈ కారణంతోనే కొత్తగా ప్రైవేట్ యూనివర్సిటీలకు అనుమతులు ఇవ్వవద్దని ఉన్నత విద్యాశాఖ మంత్రికి ముఖ్యమంత్రి సూచించినట్టు సమాచారం. ఇదే కారణంతోనే ఉన్నత విద్యాశాఖ వద్ద ఉండే ఫైళ్లను పెండింగ్‌లో ఉంచారు. గత ఏడాది బెంగళూరు నగర పరిధిలో ప్రైవేట్ యూనివర్సిటీ ఒకటి రాష్ట్రప్రభుత్వం నుంచి అనుమతులు పొంది 60సీట్లుగా ఉండే అనుమతులను 600కు నకలు చేసుకుని పట్టుబడింది. పలు యూనివర్సిటీలు అకడమిక్‌లను సక్రమంగా నిర్వహించడం లేదని, పైగా అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఫీజులతో పాటు వివిధ కార్యక్రమాల పేరిట అదనంగా వసూళ్లు చేస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి యూనివర్సిటీలపై చర్యలకు ఉన్నతవిద్యాశాఖ సన్నద్ధమైంది. ఎయిడెడ్ కళాశాలలు ప్రైవేట్‌గా మారిన వెంటనే కోర్సుల ఫీజులు పెంచేసుకుంటున్నారు. స్వయంప్రతిపత్తి పొందిన వెంటనే పాఠ్యాంశాలను మార్పు చేసుకుంటున్నాయి. అంచెలంచెలుగా కళాశాలను ప్రైవేట్ యూనివర్సిటీలుగా మార్చుకునేందుకు ప్రయత్నిస్తారు. యూనివర్సిటీలుగా మారిన వెంటనే సంపూర్ణంగా మార్పులు చేసుకుంటారు. ఇక్కడ చట్టవ్యతిరేకంగా ఏం జరిగినా ప్రభుత్వం నియంత్రించడం సాధ్యంకాని పరిస్థితి ఉంది. అధికారులను కళాశాల లోపలికి అనుమతించడంలేదు. అందుకే ప్రభుత్వం ఆచితూచి వ్యవహరిస్తోంది. ప్రస్తుతం యూనివర్సిటీల కోసం దరఖాస్తు చేసుకున్న కళాశాలలో బెంగళూరు నుంచే నాలుగు ప్రతిపాదనలు ఉన్నాయి. మంగళూరు నుంచి 2, మైసూరు, చిక్కబళ్లాపుర, రామనగరలనుంచి ఒక్కొక్కటి ఉన్నాయి. వీటిలో బెంగళూరు నుంచి అల్-అమీన్ ట్రస్టు, ఎంజీ చారిటబుల్ ట్రస్టు, ఆర్ఎన్‌శెట్టి ట్రస్టు, గోపాలన్ ఫౌండేషన్, మంగళూరు నుంచి కణచూరు ఇస్లామిక్ ఎడ్యుకేషన్ ట్రస్టు, లక్ష్మీస్మారక ఎడ్యుకేషన్ ట్రస్టు, చిక్కబళ్లాపురకు చెందిన ఎన్ఎం అకాడమీ ట్రస్టు, సెంటర్ ఆర్ ముస్లింస్ అసోసియేషన్ కర్ణాటక, రామనగర, మైసూరుకు చెందిన మహారాజ ఎడ్యుకేషన్ ట్రస్టు ఉన్నాయి.

ఉద్యోగుల ఉద్యమబాట

ఏడో వేతన కమిషన్ అమలుకు డిమాండ్... 29 నుంచి నిరవధిక నిరసన



బెంగళూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వంపై ఉద్యమానికి ఉద్యోగులు సిద్ధమవుతున్నారు. ఏడో వేతన కమిషన్ అమలుతోపాటు మూడు ప్రధాన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 29 నుంచి నిరవధిక నిరసనకు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు రాష్ట్రప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆందోళనకు పిలుపునిచ్చింది. ఏడో వేతన కమిషన్ వెంటనే అమలు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని తీసుకురావాలని, ఆరోగ్య సంజీవని పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఆదివారం చిక్కమగళూరులో ప్రభుత్వ ఉద్యోగుల కార్యవర్గ సమావేశం జరిగింది. సోమవారం నుంచి 14వరకు తాలూకా, జిల్లా కేంద్రాలలో నిరసనలు చేపడుతున్నారు. 23న బెంగళూరులో ఉద్యోగుల కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేసి నిరసనపై విధి విధానాలను ప్రకటిస్తామని ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సీఎస్ షడాక్షరి తెలిపారు. ఏడో వేతన కమిషన్ నివేదిక ఇచ్చి 19 నెలలు పూర్తి అవుతున్నా ఇప్పటివరకు అమలు చేయకుండా ప్రభుత్వం జాప్యం చేస్తోందన్నారు. పాత పెన్షన్, ఆరోగ్య సంజీవని డిమాండ్ కూడా రెండేళ్లుగా కాలయాపనకే పరిమితమైందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు నిరసనకు వెళ్తే రాష్ట్ర ప్రభుత్వానికి షాక్ ఇచ్చినట్టే. ఇప్పటికే ప్రభుత్వం వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో రూ.187 కోట్ల అవినీతి, ముడాలో ఇళ్ల స్థలాల పంపిణీలో వేల కోట్ల అవినీతి ఆరోపణలతో చిక్కుకుపోయింది. ఉద్యోగులు నిరవధిక నిరసనకు దిగితే పాలనా వ్యవస్థ స్తంభించిపోనుంది.

మాజీ మంత్రి బీసీ పాటిల్ అల్లుడు ఆత్మహత్య



ప్రతాప్‌కుమార్ (ఫైల్)

బెంగళూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, బీజేపీ సీనియర్ నేత బీసీ పాటిల్ అల్లుడు కేజీ ప్రతాప్‌కుమార్ (41) సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. దావణగెరె జిల్లా హొన్నాళి తాలూకా కత్తలగెరె గ్రామానికి చెందిన ప్రతాప్‌కుమార్ బీసీ పాటిల్ కుమార్తె సౌమ్యపాటిల్‌ను వివాహం చేసుకున్నారు. హొన్నాళి తాలూకా అరకెరె అటవీప్రదేశంలో ప్రతాప్‌కుమార్ క్రిమిసంహారక మందు తాగి కారులో స్పృహ కోల్పోయి ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే శివమొగ్గ మాక్స్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే బీసీ పాటిల్ శివమొగ్గకు చేరుకున్నారు. మృతదేహాన్ని మెగ్గాన్ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ప్రతాప్‌కుమార్ కాంట్రాక్టర్‌గా కొనసాగుతుండేవారు. ఆత్మహత్యకు గల కారణాలను పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మిరియాల రైతుకు బంపర్ ధరలు



కిలో 700కు పైగానే పలుకుతున్న వైనం

వియత్నాంలో దిగుబడి తగ్గడంతో పెరిగిన డిమాండ్



బెంగళూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో మాత్రమే సాగు చేసే మిరియాల రైతులకు లాభాలు కురిపిస్తున్నాయి. జూన్ ప్రారంభం నుంచి మిరియాల ధరలు పెరుగుతూ వస్తున్నాయి. రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. సాగు చేస్తున్న రైతుల ఆశలు వికసిస్తున్నాయి. గడిచిన ఆరేడేళ్లుగా మిరియాలు కిలో రూ.500లోపు ధర పలికేది. జూన్ ప్రారంభం నుంచి కిలో రూ.700దాకా ధరలు పలుకుతున్నాయి. 2016-17 సంవత్సరంలో మిరియాలు కిలో రూ.750 నుంచి రూ.800 దాకా ధర పలకగా ఆ తర్వాత తగ్గుముఖం పడుతూ వచ్చాయి. గత ఏడాది విశ్వవ్యాప్తంగా మిరియాల దిగుబడి గణనీయంగా తగ్గింది. దీంతో దేశీయ మిరియాలకు డిమాండ్ పెరిగింది. వాతావరణంలో మార్పుల కారణంగా వియత్నాం, ఇండోనేషియా, బ్రెజిల్ దేశాల్లో మిరియాల దిగుబడి తగ్గింది. ఈ దేశాలలో దశాబ్దాల కాలంగా మిరియాలసాగు తగ్గుముఖం పట్టింది. ప్రపంచమార్కెట్‌లో 40 శాతం వియత్నాం మిరియాలు విక్రయమవుతాయి. అక్కడే పంట దిగుబడి తగ్గుముఖం పట్టింది. బ్రెజిల్‌లో అత్యధిక ఉష్ణోగ్రతల కారణంగా సుమారు 15 శాతం దిగుబడి తగ్గింది. ఇండోనేషియా, మలేషియాలలోని కోకోతోపాటు పలు పంటలు సాగు చేస్తారు. వ్యాధులు తీవ్రమవుతుండడంతో మిరియాల పంటలను తొలగిస్తున్నారు. ఇలా విశ్వవ్యాప్తంగా మిరియాల దిగుబడి తగ్గుతోంది. రాష్ట్రంలో కొడగు, చిక్కమగళూరు, శివమొగ్గ, దక్షిణకన్నడ, ఉడుపితోపాటు పలు జిల్లాల్లో కాఫీ, వక్కతోపాటు ఇతర పంటలను మిశ్రమంగా సాగు చేస్తారు. కొడగు జిల్లాలో అత్యధికంగా మిరియాలు సాగు చేసే రైతులు ఉన్నారు. మిరియాల సాగుకు ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండి వర్షాలు అధికంగా కురిసే ప్రాంతాలు, నీడ కలిగి ఉంటే ఉత్తమ దిగుబడి సాధ్యమవుతుంది. కొడగు జిల్లాలో గత ఏడాది ఎండలధాటికి కొంత మేర పంట దెబ్బతిందని ఉద్యానవనవనశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మిలన్ ముత్తణ్ణ తెలిపారు. వియత్నాంతోపాటు వివిధ దేశాలలో పంట దిగుబడి తగ్గడంతో మార్కెట్‌లో డిమాండ్ పెరిగిందని, ఇది రాష్ట్ర రైతులకు అనుకూలం కానుందని భారతీయ సంచార పంటల పరిశోధనా కేంద్రం ముఖ్యులు అంకేగౌడ అభిప్రాయపడ్డారు.





స్థానిక సమరానికి వెనుకడుగు

- లోక్‌సభ ఫలితాలతో కాంగ్రెస్‌లో నైరాశ్యం
- బీజేపీ, జేడీఎస్ కూటమిలో ఉత్సాహం
- వాయిదాకే మొగ్గు చూపుతున్న అధికార పార్టీ

బెంగళూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): శాసన సభ ఎన్నికల్లో ఊహించని ఫలితాలతో ఉత్సాహం మీద ఉన్న కాంగ్రెస్ పార్టీ ఏడాదిలోగానే స్థానిక సమరానికి వెళ్లాలని భావించింది. లోక్‌సభ ఎన్నికలు ఇటు రాష్ట్రానికే కాకుండా అటు జాతీయ రాజకీయాలకు కీలకమైనవి కావడంతో ముగిసిన వెంటనే సమరం పూరిద్దామని భావించారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్‌కు ఆశించినంత మేర ఉత్సాహం ఇవ్వలేదు. 28 లోక్‌సభ స్థానాల్లో కనీసం 20సీట్లు దక్కుతాయనే దీమాలో కొనసాగారు. కానీ 9 స్థానాలకే పరిమితమయ్యారు. బెంగళూరు నగరం, గ్రామీణ, మండ్య, మైసూరు, దక్షిణకన్నడ, ఉత్తరకన్నడ, ఉడుపి జిల్లాలు పూర్తిగా బీజేపీ వశమయ్యాయి. మరోవైపు ఉత్తర కర్ణాటకలోనూ ఇవే ఫలితాలు నమోదయ్యాయి. కల్యాణ కర్ణాటక కొంత మెరుగు అనిపించింది. లోక్‌సభ ఎన్నికలకు ముందే బీజేపీ, జేడీఎస్ మైత్రి ఏర్పాటు చేసుకోవడం ద్వారా ప్రతిపక్షంలో ఉన్నా ఉత్తమ ఫలితాలు సాధించారు. శాసన సభ ఎన్నికల్లో బీజేపీ, జేడీఎస్ కోటలోనూ పైచేయి సాధించామని భావించిన కాంగ్రెస్‌కు లోక్‌సభ ఫలితాలు ఏ విధంగా నిర్ధయించుకోవాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. ఇదే సందర్భంలోనే అంతరంగికంగా జిల్లా పంచాయతీ, తాలూకా పంచాయతీల వారీగా జరిపిన సర్వేలు ఆశాజనకం కాదని వచ్చినట్టు తెలుస్తోంది. ఇందుకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులు, ఎమ్మెల్యేలు ఆచితూచి అడుగు వేయాలని, ఆత్రుత వద్దని అభిప్రాయంలో ఉన్నట్టు తెలుస్తోంది. మైసూరు పాలికె ఎన్నికలు లోక్‌సభ సమరానికి ముందే జరపాలని, 65 వార్డుల్లో కనీసం 35 కైవసం అవుతాయని పార్టీ వర్గాలు భావించాయి. కాంగ్రెస్‌కు 24, బీజేపీకి 21, జేడీఎస్‌కు 18 స్థానాలు దక్కాయి. కానీ లోక్‌సభ ఎన్నికల్లో దాదాపు అన్ని వార్డులలోనూ బీజేపీ అభ్యర్థి యదువీర్‌కు మెజారిటీ వచ్చింది. ఇదే పరిస్థితి జిల్లా పంచాయతీ, తాలూకా పంచాయతీలలో కొనసాగవచ్చునని కాంగ్రెస్ పార్టీ నేతలు వెనుకడుగు వేస్తున్నట్టు తెలుస్తోంది. శాసనసభ ఎన్నికల తర్వాత బీజేపీ, జేడీఎస్ డీలా పడ్డాయి. వెంటనే ఎన్నికలు జరిగి ఉంటే ఎక్కువస్థానాలు అధికార పార్టీకి కలిసొచ్చేవి. ప్రస్తుతం బీజేపీ - జేడీఎస్ మైత్రితో అన్ని జిల్లాల కార్యకర్తల్లోనూ జోష్ పెరిగింది. ప్రతి చోటా మాదే హవా అనే పరిస్థితి కాంగ్రెస్‌కు లేకుండా పోయింది. బీజేపీ-జేడీఎస్ ఉమ్మడిగా స్థానిక సమరానికి వెళ్తే ప్రతిచోటా పార్టీ సంఖ్యాబలం ప్రకారం అధికారం పంచుకుంటామని జేడీఎస్ ముఖ్యనేతలు జీటీ దేవెగౌడ, సా రా మహేశ్ అంటున్నారు. ఎన్నికలకు ముందే అధికారాన్ని పంచుకునే అంశంపై కూడా కూటమి నాయకులు స్పష్టత తో ఉన్నారంటే ఆచితూచి వ్యవహరించాలని కాంగ్రెస్ భావిస్తోంది.





ఒప్పందంలో డీజీపీ, బ్యాంకు జనరల్ మేనేజర్ తదితరులు

పోలీసు విభాగంతో కెనరాబ్యాంకు ఒప్పందం

బెంగళూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): కెనరాబ్యాంకు, కర్ణాటక స్టేట్ పోలీస్ విభాగంతో కీలక ఒప్పందం చేసుకుంది. కెనరా ప్రీమియం పేరోల్ అకౌంట్స్ విధానం రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్నారు. కెనరాబ్యాంకు జనరల్ మేనేజర్ మహేశ్ ఎం. పాయ్, డీజీపీ అలోక్‌మోహన్ పరస్పరం ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ద్వారా రాష్ట్ర పోలీసులకు, సిబ్బందికి కెనరా బ్యాంకు అన్ని విధాలా సహకారం అందించనుంది.

రాష్ట్రానికి మరో ఐదు మెడికల్ కళాశాలలు

రామనగర జిల్లాకే రెండు... అందుబాటులోకి వైద్య సేవలు

పెరగనున్న సీట్లు

బెంగళూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నేషనల్ మెడికల్ కౌన్సిల్ 2024-25 సంవత్సరానికి సంబంధించి రాష్ట్రానికి ఐదు మెడికల్ కళాశాలలను మంజూరు చేసింది. ఇందులో రామనగర జిల్లా పరిధిలోనే రెండు మెడికల్ కళాశాలలు ప్రారంభం కానున్నాయి. కనకపుర మెడికల్ కళాశాల, రామనగర మెడికల్ కళాశాల, ఎలక్ట్రానిక్‌సిటీలో పీఈఎస్ మెడికల్ కళాశాల, బాగల్కోటెలో ఎస్ఆర్ పాటిల్ మెడికల్ కళాశాల, దాసనపుర - నెలమంగలలో బీజీఎస్ మెడికల్ కళాశాలలకు అనుమతులు ఇచ్చారు. ఇప్పటికే సదరు సంస్థల పేరిట ఆసుపత్రులు కొనసాగుతున్నాయి. రాష్ట్రానికి ఐదు మెడికల్ కళాశాలలు రావడంతో వైద్యసేవలు మరింత అందుబాటులోకి రావడంతోపాటు కొత్తగా మెడికల్ కోర్సులు చేసేవారికి అవకాశం దక్కనుంది. రాజీవ్‌గాంధీ మెడికల్ యూనివర్సిటీ ఈ ఏడాది నాలుగు మెడికల్ కళాశాలలకు అనుమతులు కోరింది. ఈ నాలుగింటితోపాటు ప్రైవేట్‌గా పీఈఎస్ మెడికల్ కళాశాలకు అనుమతులు దక్కాయి.

డీసీలంటే మహారాజులు కాదు

- మీరూ ప్రజాసేవకులే
- డీసీలు, సీఈఓల సమన్వయంతోనే జిల్లా అభివృద్ధి
- రాష్ట్రస్థాయి అధికారుల సమీక్షలో సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా అధికారులు (డిప్యూటీ కమిషనర్) అంటే మహారాజులు అనే భావన ఉంటే అభివృద్ధి సాధ్యం కాదని, ప్రజా ప్రతినిధులు, అధికారులు సేవకులనేది గుర్తుంచుకుని ప్రజాసేవ చేయాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్య సూచించారు. విధానసౌధలో సోమవారం డీసీలు, జిల్లా పంచాయతీ సీఈఓలు, ఇన్‌చార్జ్ సెక్రటరీలతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రజనీశ్ గోయెల్ సహా ముఖ్య అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు క్రియాశీలకంగా కొనసాగి ప్రజలకు చేరాలంటే జిల్లాస్థాయి అధికారులు సమన్వయంగా పనిచేయాల్సి ఉంటుందన్నారు. అప్పుడే సత్ఫలితాలు సాధ్యమవుతాయన్నారు. రాష్ట్రంలో డెంగీ జ్వర నియంత్రణకు డీసీలు, జిల్లా వైద్యాధికారులు, తాలూకా స్థాయి అధికారులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. నిర్లక్ష్యం, జాప్యం, విధి నిర్వహణలో అలసత్వం వంటి కారణాలకు కిందిస్థాయి అధికారులు మాత్రమే బాధ్యులను చేశామని, ఇకపై సీనియర్ అధికారులకు ఇవే నిబంధనలు వర్తిస్తాయని హెచ్చరించారు. ప్రతి అధికారి తన శాఖ పరిధిలో పొరపాట్లకు బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. డీసీలు, సీఈఓలు, జిల్లా సమాచారాన్ని నిరంతరం అందుబాటులో ఉంచుకుని ఉత్సాహంతో పనిచేస్తేనే అభివృద్ధి వేగవంతమవుతుందన్నారు. 40ఏళ్ల క్రితం అధికారుల పనితీరుకు ప్రస్తుత అధికారులకు తేడా ఉందన్నారు. అభివృద్ధి, శాంతిభద్రతల్లో పరస్పరం అనుసంధానంగా ఉండాలన్నారు. లేదంటే మరిన్ని సమస్యలు వస్తాయన్నారు. కర్ణాటక రాష్ట్రమంటే ఉత్తమ పాలనకు పేరుగాంచిందని, ఈ సంప్రదాయం కొనసాగాలని తెలిపారు. జిల్లా అధికారుల పర్యటనలో మానవ వనరులతోపాటు సమగ్ర సమాచారాన్ని తెలుసుకోవాలన్నారు. ఎస్ఎస్ఎల్‌సీలో ఫలితాలు తగ్గడాన్ని ప్రస్తావించిన సీఎం, ఇటీవలి పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌ను సంపూర్ణంగా అరికట్టడంపై అభినందించారు. ఈ కారణానికే ఫలితాలు తగ్గాయని సమర్థించడం సరికాదన్నారు. డీడీపీఐ, డీసీ, సీఈఓలు సమన్వయంతో జిల్లా సమస్యలపై చర్చించాలన్నారు. జన స్పందన, జనతాదర్శన్ సమావేశాలకు వేలల్లో అర్జీలు వస్తున్నాయంటే జిల్లాస్థాయిలో పనులు కాకపోవడమే కారణమన్నారు. తహసీల్దార్లు, జిల్లా అధికారులు ప్రజలను సంప్రదించడంలో విఫలమవుతున్నారని అన్నారు. సంచార గొర్రెల పెంపకందారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని సూచించారు. మట్టి సారవంతంపై పరీక్షలు జరపాలని, రెండేళ్లకోసారి భూసార పరీక్షలు నిర్వహించాలని తెలిపారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య



మాట్లాడుతున్న డీకే శివకుమార్

తహసీల్దార్ కార్యాలయాల్లో 8,234 ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సబ్‌డివిజన్ పరిధిలో పట్టాల మార్పిడిలో 37,587 పెండింగ్‌లో ఉండడాన్ని ప్రస్తావించారు. ఐదేళ్లకు పైబడిన ఫైళ్లు 7,522 ఉన్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. డీసీల వద్ద 10,838 ఫైళ్లు ఉన్నాయని గుర్తు చేశారు. కొందరు డీసీలు ఫైళ్ల క్లియరెన్స్‌ను పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు ప్రజలకు అందుబాటులో లేకుంటే ఎలాగని ప్రశ్నించారు. సమావేశంలో మంత్రులు పరమేశ్వర్, సతీశ్‌జార్కిహొళి, సంతోష్‌లాడ్, ఆర్‌బీ తిమ్మాపుర, హెచ్‌కే పాటిల్, ఎంబీ పాటిల్, మహదేవప్ప, చలువరాయస్వామి, శరణప్రకాశ్ పాటిల్, కేజే జార్జ్, మునియప్ప, కృష్ణబైరేగౌడ, డాక్టర్ సుధాకర్, లక్ష్మీ హెబ్బాళ్కర్, రాజణ్ణతోపాటు దాదాపు మంత్రులంతా, ప్రిన్సిపల్ సెక్రటరీలు పాల్గొన్నారు. ఇదే సందర్భంగా మంత్రులు నందిని ఉత్పత్తులను ఆవిష్కరించారు. కాగా సీఎం, డీసీఎం మధ్య ఇటీవల పలు వివాదాలు ఉన్నాయని, వారిమధ్య సఖ్యత లేదనే అంశం హల్‌చల్ చేసింది. అధికారుల సమీక్షలో ఇద్దరూ నవ్వుతూ పలకరించుకుని పలు అంశాలపై చర్చించుకోవడం విశేషం.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

గుమ్మడి వెంకటేశ్వరరావు (జయంతి)



ఇంటి పేరు 'గుమ్మడి'గానే పేరొందిన 'కళాప్రపూర్ణ' గ్రహీత గుమ్మడి వెంకటేశ్వరరావు 1927 జూలై 9న గుంటూరు జిల్లా తెనాలి సమీపాన రావికంపాడు గ్రామంలో జన్మించారు. తెలుగు చలన చిత్ర రంగంలో ఐదు దశాబ్దాలకుపైగా 500కంటే ఎక్కువ సినిమాలలో విభిన్న తరహాపాత్రలలో పోషించారు. పౌరాణిక, చారిత్రక, జానపద, సాంఘిక చిత్రాలలో అన్నిరకాల సినిమాలలో తండ్రిగా, అన్నగా, తాతగా పలు పాత్రలలో నటించి మెప్పించారు. రఘుపతి వెంకయ్య, పద్మశ్రీ, రాష్ట్రపతి అవార్డు, నంది అవార్డు తదితర పురస్కారాలు పొందారు. 2010 జనవరి 26న కన్నుమూశారు.

కె.బాలచందర్ (జయంతి)



జాతీయస్థాయిలో పేరొందిన సినీ దర్శకులలో కె.బాలచందర్ ఒకరు. ఆయన 1930 జూలై 9న తమిళనాడు రాష్ట్రం తంజావూరు దగ్గర నన్నిలం ప్రాంతంలో జన్మించారు. రచయిత, నిర్మాత, నటుడు కూడా. ఐదు దశాబ్దాల కెరీర్‌లో తమిళం, తెలుగు, కన్నడ భాషలలో వందకుపైగా సినిమాలు రూపొందించారు. పదుల సంఖ్యలో నటులను వెండితెరకు పరిచయం చేశారు. నగేశ్, సుజాత, కమల్‌హాసన్, రజనీకాంత్, చిరంజీవి, జయప్రద, శ్రీదేవి, జయసుధ వంటివారు ఉన్నారు. 'రోజా'తో సంగీతదర్శకుడు ఏఆర్ రెహమాన్‌ను పరిచయం చేశారు. పద్మశ్రీ, దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు సహా 9జాతీయ సినీ అవార్డులు, 13ఫిల్మ్‌ఫేర్, నంది అవార్డులు, 'కళైమామణి' ఇతరత్రా గౌరవాలు పొందారు. 2014 డిసెంబరు 23న కన్నుమూశారు.

యూజీ కృష్ణమూర్తి (జయంతి)



యూజీగా సుపరిచితులైన తత్వవేత్త ఉప్పులూరి గోపాల కృష్ణమూర్తి 1918 జూలై 9న మచిలీపట్నంలో జన్మించారు. థియోసాఫికల్ సొసైటీలో సభ్యుడిగా కొనసాగారు. స్వామి వివేకానందతో కలసి హిమాలయాలలో పలుమార్లు యోగా, ధ్యానం చేసిన ఘనత ఆయనది. మంచివక్తగా పేరొందారు. ఆయన తత్వం విభిన్నంగా ఉండేది. పలు పుస్తకాలు రచించారు. 2007 మార్చి 22న కన్నుమూశారు.

గురుదత్ (జయంతి)



'గురుదత్'గా చిరపరిచితులైన వసంత్‌కుమార్ శివశంకర్ పడుకొనె 1925 జూలై 9న కర్ణాటక రాష్ట్రం ఉడుపి జిల్లా బైదూరు తాలూకా పడుకొనె గ్రామంలో జన్మించారు. దర్శకుడిగా, నిర్మాతగా, నటుడి, కొరియోగ్రాఫర్‌గా రాణించారు. 1950, 60 దశకాల మధ్య క్లాసికల్ సినిమాలు 'ప్యాసా', కాగజ్ కే ఫూల్, సాహిబ్ ఔర్ గులామ్ ఎంతో పేరొందాయి. ఆయన సినిమాలు దేశంలోనేకాక ప్రపంచవ్యాప్తంగా జరిగిన చిత్రోత్సవాలలో ప్రదర్శించారు. 39వ యేట 1964 అక్టోబరు 10న కన్నుమూశారు. 2004లో ఆయన స్మారక పోస్టల్ స్టాంపు విడుదల చేశారు.

టామ్ హాంక్స్ (పుట్టినరోజు)



అమెరికా దేశ కల్చరల్ ఐకాన్‌గా గుర్తింపు పొందిన ప్రముఖ నటుడు థామస్ జెఫ్రీ హాంక్స్ 1956 జూలై 9న జన్మించారు. దర్శకుడిగాను రాణించారు. కామెడీ, డ్రమటిక్ రోల్స్‌తో పేరొందారు. 7 ప్రైమ్‌టైమ్ ఎమ్మీ అవార్డులు, 'ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్', బాఫ్టా అవార్డు, కెన్నెడీ సెంటర్ అవార్డు తదితర అవార్డులు అందుకున్నారు. 2019లో 'ది బెస్ట్ యాక్టర్స్ ఇన్ ఫిల్మ్ హిస్టరీ'లో ఒకటవ ర్యాంకులో నిలిచారు. యునైటెడ్ స్టేట్స్ ఆర్మీ రేంజర్స్‌లో గౌరవ సభ్యత్వం కల్గిన తొలి నటుడు.

ఉన్నికృష్ణన్ (పుట్టినరోజు)



పి. ఉన్నికృష్ణన్ 1966 జూలై 9న కేరళ రాష్ట్రం పాలక్కాడ్‌లో జన్మించారు. కర్ణాటక సంగీతంలోనూ 12వ యేటనే తనదైన ప్రతిభను చాటారు. 1992 నుంచి ప్రముఖ నేపథ్య గాయకుడిగా రాణిస్తున్నారు. ఉత్తమ నేపథ్యగాయకుడిగా నేషనల్ ఫిల్మ్ అవార్డుతోపాటు కళైమామణి, నాదభూషణం, సంగీత చక్రవర్తి, తదితర పురస్కారాలు అందుకున్నారు. బుల్లితెరపై పాటల పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు.

ప్రమాదకరంగా శిథిల భవనాలు



ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆవరణలోని ఓ భవన దుస్థితి ఇలా..

దొమ్మసంద్ర, జూలై 8: ఆనేకల్ తాలూకాలోని దొమ్మసంద్ర ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆవరణలో దుస్థితిలో ఉన్న భవనాలు, ఓవర్‌హెడ్ నీటి ట్యాంకు మృత్యుకూపంగా ఉన్నాయి. జిల్లా పంచాయతీ, తాలూకా పంచాయతీ, ఈఓ, డిహెచ్ఓ, టిహెచ్ఓ అధికారులు మాత్రం తమకేమీ తెలియదనే రీతిలో వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. దొమ్మసంద్ర గ్రామపంచాయతీ అధ్యక్షుడు నరేశ్‌ను వివరణ కోరగా దుస్థితిలో ఉన్న భవనాలను తొలగించేందుకు తమ పంచాయతీలో అంత మొత్తం గ్రాంటు లేదని బదులిచ్చారు. ఒకవైపు డెంగీ జ్వరం ప్రబలుతూ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటుండగా ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆవరణలో స్వచ్ఛత కొరవడి పలు భవనాలు దుస్థితిలో ఉన్నా పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.



దుస్థితిలో ఓవర్‌హెడ్‌ట్యాంకు

కాగా 2023 సెప్టెంబరు 22న స్థానిక ఆరోగ్య అధికారి డాక్టర్ జయభారత్ ఆనేకల్ తాలూకా ఈఓకు, డిహెచ్ఓ, టిహెచ్ఓలకు లేఖలు రాశారు. దొమ్మసంద్ర ఆసుపత్రి ఆవరణలో దుస్థితిలో ఉన్న భవనాలను తొలగించాలని పేర్కొన్నారు. నెలలు గడిచినా స్పందన లేకపోయిందని ప్రజలు ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు.

పాల బకాయిలు విడుదల చేయండి

బంగారపేట, జూలై 8: పాల ప్రోత్సాహక మొత్తం బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని కోరుతూ కర్ణాటక ప్రాంత రైతుసంఘం డిమాండ్ చేసింది. లీటరు పాలకు రూ.50 ధర నిర్ణయించాలని కోరారు. కర్ణాటక రాష్ట్ర పాల ఉత్పత్తిదారుల రైతుల క్షేమాభివృద్ధి సంఘం, కర్ణాటక ప్రాంత రైతు సంఘం నేతృత్వంలో సమస్యలు విన్నవించారు. నూతనంగా ఏర్పాటైన కోచిముల్ శిబిరం కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. సంఘం అధ్యక్షుడు పి.శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళల శ్రమ ప్రధానంగా పాడిరంగం ఉన్నా పలు సమస్యలు ఎదుర్కొంటున్నట్టు తెలిపారు. కెఎంఎఫ్‌లో 15 పాల సమాఖ్యలు ఉన్నాయని, 14,900 ప్రాథమిక పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల ద్వారా 22.5లక్షలమంది సభ్యులు ప్రతిరోజూ 90 లక్షలనుంచి 1 కోటి లీటర్ల పాల సేకరణ అవుతోందన్నారు. ప్రస్తుతం రోజురోజుకు పశుదాణా ఇతర ఖర్చులు పెరిగాయని ఇందుకు అనుగుణంగా పాలకు ప్రోత్సాహకధనం ఇవ్వాలన్నారు. ఏడాదిగా కరువు సమస్యలు ఎదుర్కొన్నారన్నారు. నిరసనలో కల్కెరె ఎం బాబు, జి.డి.రంగనాథ్, వి.సోమశేఖర్, ఎ.పిచ్చర్ కణ్ణు, టి.అప్పయ్యణ్ణ, బి.నారాయణప్ప, పెరుమాళప్ప, బిఎల్ కేశవరావ్, రామకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రాంత రైతుసంఘం ఆధ్వర్యంలో నిరసన

లాభాల బాటలో సహకార సంఘం



సంఘం వార్షికసభ ప్రారంభంలో ప్రముఖులు

హొస్కోటె, జూలై 8: హొసకోటె టౌన్ వివిధ ఉద్దేశ ప్రాథమిక గ్రామీణ కృషి సహకార సంఘం రూ.1.50 కోట్ల లాభాలతో ఉందని నిర్వాహకులు ప్రకటించారు. సంఘం వార్షి వార్షిక మహాసభ పట్టణంలోని శ్రీవారికల్యాణమండపంలో నిర్వహించారు. ఎమ్మెల్యే శరత్‌బచ్చేగౌడ సమావేశాన్ని ప్రారంభించి మాట్లాడుతూ నగరీకరణ పేరిట వ్యవసాయ భూమిని సైతం పరివర్తన చేస్తున్నారని, సాగు రుణాలు పొందేవారి సంఖ్య తగ్గుతోందని అభిప్రాయపడ్డారు. పట్టణంలోని దొడ్డగట్టిగనబ్బె రోడ్డు, సూలిబెలె రోడ్డు, చింతామణి రోడ్డు, శిడ్లఘట్ట రోడ్డు సహా పలు చోట్ల వ్యవసాయ భూములు తగ్గి లే అవుట్‌లు మారి హోటళ్లు ఇతరత్రా నిర్వహిస్తున్నారన్నారు. ఈ తరుణంలో సహకారసంఘాల నియమాలు కూడా మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. సహకారసంఘం అధ్యక్షుడు కె.కృష్ణమూర్తి మాట్లాడుతూ తాను బాధ్యతలు చేపట్టినవేళ నష్టాల్లో ఉండేదని అనంతరం ప్రజాప్రతినిధులు, రైతుల సహకారంతో లాభాల బాటలోకి తెచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో సంఘం సభ్యుల పిల్లలకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ బి.ఎన్.బచ్చేగౌడ, టీఏపీసీఎంఎస్ అధ్యక్షుడు బాబురెడ్డి, పారిశ్రామికవేత్త బైరేగౌడ, సంఘం ముఖ్య కార్యనిర్వహణాధికారి నారాయణ శర్మ, నగర యోజనా ప్రాధికార సభ్యుడు హెచ్ఎం సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

డెంగీ నియంత్రణపై జాగృతి

శిడ్లఘట్ట, జూలై 8: తాలూకాలోని సాదలి హోబళి దిబ్బూరహళ్ళిలో డెంగీ నియంత్రణపై జాగృతి నిర్వహించారు. ఈడిస్ ఈజిప్ట్ దోమ ద్వారా జ్వరం ప్రబలుతుందని ఇందుకు లార్వాదశలోనే మనం అడ్డుకట్ట వేస్తే ఉత్తమమని డాక్టర్ యశ్వంత్ ప్రసాద్ సూచించారు. మన చుట్టుపక్కల ప్రాంతాలలో వర్షపునీరు కొబ్బరి చిప్పలు, టైర్లు, పెంకులు వంటి వాటిల్లో నిల్వకాకుండా చూడాలని స్వచ్ఛత పాటించడం ద్వారా దోమల నియంత్రణ సాధ్యమని అభిప్రాయపడ్డారు. విపరీతమైన జ్వరం, ఒంటిపై ఎర్రటి గుల్లలు, కంటి వెనుక నొప్పి, తల నొప్పి, ఇతరత్రా ఈ జ్వరం లక్షణాలుగా పేర్కొన్నారు. జ్వరం తీవ్రమైతే మరికొందరిలో ముక్కు, నోరు, ముక్కు రంధ్రాలనుంచి రక్తం పడే అవకాశం ఉందన్నారు. గ్రామపంచాయతీ అధికారి రమేశ్ మాట్లాడుతూ డెంగీ నియంత్రణకు ఎవరిలోనైనా వైద్యులు సూచించిన లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని ఆసుపత్రికి వెళ్లి చికిత్సలు పొందాలన్నారు. దోమలు ప్రబలకుండా ఉండాలంటే రోజుల తరబడి నీరు నిల్వ కాకుండా తరచుగా ట్యాంకులు, డ్రమ్ములు, తొట్టెలను శుభ్రం చేసుకోవాలన్నారు. జాగృతిలో సముదా ఆరోగ్య కేంద్రం అధికారి లక్ష్మీదేవమ్మ, ప్రకాశ్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలలో అవగాహనలో అధికారులు తదితరులు

ప్రకాశనాథ స్వామిజీకి పురస్కారం

బెంగళూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): యునైటెడ్ కింగ్‌డమ్‌లోని డిఫ్యాక్టో లర్నింగ్ సొల్యూషన్ సంస్థ ద్వారా బిజిఎస్ సంస్థల ఎండీ ప్రకాశనాథ స్వామిజీకి ఇన్నోవేషన్ ఎడ్యుకేషన్ అవార్డుచే గౌరవించారు. లండన్‌లో జరిగిన కార్యక్రమంలో డిఫ్యాక్టో డైరెక్టర్ తిమోతి ప్రదానం చేశారు. విద్యారంగానికి ప్రకాశనాథ స్వామిజీ సేవలను గుర్తించి పురస్కారాన్ని అందించినట్టు ప్రకటించారు. ఈ మేరకు బిజిఎస్ సంస్థ నగరంలో సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది.



పురస్కారంతో ప్రకాశనాథస్వామిజీ తదితరులు



పట్టణంలోని ఎంజీ రోడ్డు ఫుట్‌పాత్‌పై వేర్వేరు ప్రదేశాల్లో ఇలా..

పూడిక తొలగింపు.. రోడ్డుపైనే కంపు

చింతామణి, జూలై 8: నగరసభ పరిధిలో కొన్నేళ్ళుగా పూడిక తీయని డ్రైనేజీలను గుర్తించి తొలగించేలా ఆరోగ్య అధికారి ఆరతి సూచించారు. ఇటీవల లోకాయుక్త అధికారులు స్వచ్ఛతపై జరిపిన పరిశీలనలో చేసిన సూచనల మేరకు నగరసభ అధికారులు, సిబ్బంది స్పందించారు. ఎంజి రోడ్డుకు అనుబంధంగా ఉన్న డ్రైనేజీ నుంచి పూడిక తొలగించి వారం రోజులైంది. ఫుట్‌పాత్ సహా రోడ్డుపైనే వదిలేయడంతో సంచారానికి అంతరాయం ఏర్పడడమే కాక తిరిగి చెత్తా చెదారం కాలువలోకి క్రమేపీ చేరుతోందని స్థానికులు ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు. తొలగించిన పూడికను ఫుట్‌పాత్‌పై వదిలేయకుండా దూర ప్రాంతాలలో పడేయాలని కోరుతున్నారు. పూడిక తొలగించడానికి పౌరకార్మికులు ఎంతో శ్రమించగా రోడ్డుపై ఉన్న మట్టి, ఇతర వ్యర్థాలను తొలగించేందుకు జాప్యం చేయడం సరికాదని ఇలాగైతే కార్మికుల కష్టం, ప్రజాధనం వృథా అవుతుందని అంటున్నారు.

అన్నదాతలకోసం ఎస్‌టీఐ హబ్

» రేవా పరిశోధనా కేంద్రం ఆధ్వర్యంలో...

బెంగళూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వ సహకారంతో రేవా పరిశోధనా కేంద్రం అన్నదాతలకోసం సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్‌ను చిక్కబళ్లాపురలో ప్రారంభించింది. బెంగళూరు గ్రామీణ, బెంగళూరు ఉత్తర, చిక్కబళ్ళాపుర జిల్లాల పరిధిలోని గ్రామాలలో ఆర్థికంగా వెనుకబడినవారి ప్రగతికోసం హబ్ పని చేయనుంది. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, రైతులు పండించిన దిగుబడులకు సోలార్ డ్రైయర్, గ్రీన్ టెక్నాలజీ ఆధారిత, నీటి శుద్ధీకరణ వ్యవస్థ నిర్మాణం, పండ్లు, కూరగాయలు వంటి సంస్కరణ, హైబ్రీడ్ సిల్క్ రీలింగ్, స్పిన్నింగ్ మిషన్‌ల అభివృద్ధి, బయో బ్రికెట్‌ల ఉత్పాదనలను ఎస్‌టీఐ హబ్ ద్వారా అభివృద్ధి చేయదలిచారు. చిక్కబళ్ళాపుర పరిధిలోని పలు పల్లెల్లో ఇక్కడి రైతులు పండించే పంటలతోపాటు వారి జీవన విధానం, తదితర అంశాలపై సమగ్ర నివేదిక రూపొందించి వాటి ద్వారా ఏ రైతుకు ఏం కావాలనేది నిర్ణయించుకుని అమలు చేయనున్నట్టు రేవా ఉపకులపతి డాక్టర్ ఎన్ రమేశ్ తెలిపారు. ప్రాజెక్టు ఇన్వెస్టిగేటర్‌లు డాక్టర్ రాజె సిద్ధరాజు ఉపేంద్ర, కార్తీక్ రాజేంద్ర, విశ్వేశ్వర్‌రావు రితీశ్ దాస్, జ్యోతీశ్వర్‌రెడ్డి, ప్రొఫెసర్ పిఆర్ సవితతోపాటు రేవా యూనివర్సిటీ డాక్టర్ ఎస్ఎన్ దశరథ్ ఉన్నారు.

అధికమొత్తం బీమా పాలసీలకు ఆదరణ

బెంగళూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): టర్మ్ ఇన్సూరెన్స్ విధానంలో చైతన్యం ద్వారా అధికమొత్తం బీమా పాలసీలు పొందేందుకు ఆదరణ లభిస్తోందని ఎఫ్‌బి ఫిన్‌టెక్ గ్రూప్ సీఈఓ సబ్‌వీర్‌సింగ్ అభిప్రాయపడ్డారు. ఈమేరకు సోమవారం బెంగళూరులో ఒక ప్రకటన విడుదల చేశారు. పాలసీ బజార్ పర్యవేక్షణలో ఎక్కువ మొత్తంతో పాలసీలు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారన్నారు. ఇటీవల కొన్నేళ్లుగా 20 కోట్ల రూపాయల టర్మ్ పాలసీలు పెరగడం మార్పుకు నిదర్శనమన్నారు. ప్రముఖ మెట్రో పాలిటన్ నగరాలలో ఇటువంటి పాలసీలు పెరుగుతున్నాయన్నారు. రూ.5కోట్ల పాలసీలు పొందేందుకు ఎక్కువమంది ఆసక్తి చూపడం వెనుక ఎక్కువ కవరేజ్ కోసం ఆలోచిస్తున్నట్టు ఉందన్నారు. ఈ పాలసీలు కోటి రూపాయల తరహాలోనే సరళీకృతంగా ఉంటాయన్నారు. ప్రధానంగా ఢిల్లీ, పూనె, హైదరాబాద్, విశాఖపట్నంల తర్వాత బెంగళూరు, చెన్నైలలో ఇటువంటి పాలసీలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ప్రమాద నిర్వహణ, ఆర్థిక ప్రయోజనాల వికాసం అర్థాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలు ఎక్కువ విలువైన పాలసీలు చేయడం లేదనేది వాస్తవం కాదని నిరూపణ అవుతోందన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 8: నిరుద్యోగ యువతీ, యువకులకు కంప్యూటర్ శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి తెలిపారు. 60రోజుల పాటు బేసిక్ కంప్యూటర్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్, ట్యాలీ, లైఫ్ స్కిల్స్, వర్క్ ప్లేస్ ఎథిక్స్, స్పోకెన్ ఇంగ్లిష్, కస్టమర్ రిలేషన్‌షిప్ స్కిల్స్ కోర్సులలో నిరుద్యోగ యువతీ, యువకులకు శిక్షణ ఇస్తామన్నారు. ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, ఇంజనీరింగ్ చదివి 20-35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన నిరుద్యోగ అభ్యర్థులు అర్హులన్నారు. శిక్షణాకాలంలో మధ్యాహ్న భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. ఆసక్తి, అర్హతగల అభ్యర్థులు వివరాలు, పేర్ల నమోదుకు 73 96950345, 7780752418లను సంప్రదించాలని కోరారు.

చీనీ కాయలు టన్ను రూ.18వేలు

అనంతపురం రూరల్, జూలై 8: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.18వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 985టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

టమోటా కిలో రూ.30

అనంతపురం రూరల్, జూలై 8: కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.30 పలికినట్లు రాప్తాడు మార్కెట్ యార్డుకార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. సోమవారం మార్కెట్‌కు 150టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.23, కనిష్ఠ ధర రూ.17తో పలికినట్లు ఆయన తెలిపారు.

ఆర్ట్స్ కళాశాలలో ఉద్యోగమేళా

అనంతపురం సెంట్రల్, జూలై 8: ఆర్ట్స్ కళాశాలలో ఉద్యోగ మేళాను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ దివాకర్ రెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. జవహర్ నాలెడ్జ్ సెంటర్(జేకేసీ) ఆధ్వర్యంలో 10న నిర్వహించే ఇంటర్వ్యూల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఐసీఐసీ ఐ బ్యాంక్ సంస్థలో ఉద్యోగాలకు ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. డిగ్రీలో 50శాతం మార్కులు సాధించిన 26 సంవత్సరాల వయసులోపు యువతీ, యువకులు అర్హులన్నారు. వివరాలకు జేకేసీ కోఆర్డినేటర్ వెంకటేసులు 9704926192 నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

మహిళల పట్ల అసభ్యంగా ప్రవరిస్తే కఠిన చర్యలు: కలెక్టర్

అనంతపురం టౌన్, జూలై 8: పనిచేసే ప్రాంతంలో మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో సోమవారం మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యం లో లైంగిక వేధింపుల నిరోధక పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ పనిచేసే ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపులను నిరోధించే అంతర్గత కమిటీలు ప్రతిచోట ఉండాలన్నారు. శరీరాన్ని తాకడం, శారీరకంగా కలవాలని అభ్యర్థించడం లేదా బలవంతం చేయడం, శృంగారపరమైన చర్యలు, సంభాషణలు, కామెంట్స్, సైగలు చేస్తూ మానసికంగా వేధించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ద్వంద్వార్థాలుమాట్లాడటం, ఆత్మగౌరవం దెబ్బతినేలా ప్రవర్తించడం కూడా లైంగిక వేధింపులకిందకు వస్తుందన్నారు.

సౌకర్యాలున్నా.. వైద్యం సున్నా..

పురం ఆస్పత్రిలో చోద్యం.. అవగాహనలేని సిబ్బందితో తిప్పలు..

హిందూపురం అర్బన్, జూలై 8: ఉమ్మడి అనంత జిల్లాలో స్థానిక జిల్లా ఆస్పత్రి ఎంతో ప్రత్యేకం. ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహించిన నందమూరి తారక రామారావు, ఆయన వారసుడు, ప్రస్తుత ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆస్పత్రి అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యమిచ్చారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎన్నో అధునాతన సౌకర్యాలు కల్పించారు. బాలయ్య చొరవ తీసుకుని, రాష్ట్రంలో ఎక్కడాలేనివిధంగా హిందూపురంలో డెంటల్ ల్యాబ్ ఏర్పాటు చేయించారు. దంత చికిత్సల నిమిత్తం ఎక్స్‌రే యంత్రాన్ని కూడా తెప్పించారు. వీటిద్వారా దంతాలను కట్టవచ్చు. అన్ని దంతాలను ప్రైవేటు ఆస్పత్రుల్లో కట్టించుకోవాలంటే రూ.30 వేలకుపైగానే ఖర్చు చేయాల్సి వస్తుంది. ప్రభుత్వ ఆస్పత్రిలో పేదలకు ఉచితంగా కట్టుడు దంతాలు అందిస్తున్నారు. డెంటల్ ఎక్స్‌రే యంత్రం ఉన్నా.. ఎక్స్‌రే తీసి దానిని డెవలప్ చేయడానికి అవసరమైన లిక్విడ్ లేదు. టెక్నీషియన్లు కూడా లేరు. దీంతో ఎక్స్‌రే యంత్రం మూలన పడేశారు. ప్రభుత్వం ఇద్దరు టెక్నీషియన్లను నియమించింది. వారిలో కాంట్రాక్టు ప్రాతిపదికన తీసుకున్న ఒకరికి దీనిపై అవగాహన లేదని తెలుస్తోంది. మరొకరిని నేషనల్ హెల్త్ మిషన్ కింద తీసుకున్నారు. ఆయనకు కట్టుడు పళ్లమీద అవగాహన ఉందని సమాచారం. ఆయనను కాకుండా అవగాహన లేని వ్యక్తిని నియమించడం వెనుక ఆంతర్యమేమిటో పెరుమాళ్లకే ఎరుక. పని రాక ఒకరు, పని వచ్చినా అది తన బాధ్యత కాదని మరొకరు ఉంటుండడంతో రోగులకు సేవలు దూరమయ్యాయి. పర్యవేక్షించాల్సిన ఉన్నతాధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు మూటగట్టుకుంటున్నారు.



తప్పని రెఫర్లు..

సౌకర్యాలున్నా టెక్నీషియన్లు లేక దంత సమస్యలతో వచ్చేవారిని కట్టుడు దంతాలకు బయటకు రెఫర్ చేస్తున్నారు. ప్రైవేటులో వైద్యం చేయించుకోవాలంటే రూ.వేలల్లో వెచ్చించాల్సి వస్తోంది. ఇది పేదలకు భారంకానుంది. కొంతమంది అంత స్తోమత లేక నొప్పిని భరిస్తూ అలాగే ఉంటున్నారు. మరికొందరు నాటు వైద్యం చేయించుకుంటున్నట్లు తెలుస్తోంది. మరికొందరైతే అప్పులు చేసి బయట చికిత్సలు పొందుతున్నారు. కేవలం రూ.3000 ఖర్చు చేస్తే 150 మందికి ఎక్స్‌రే తీయవచ్చు కానీ, డెవలప్‌మెంట్ సర్వీసు లేక యంత్రాలు మూలనపడి ఉన్నాయి.

రోజూ 40 మందిదాకా ఓపీకి..

హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రి ఓపీకి రోజూ 40 మందిదాకా దంత సమస్యలతో వస్తుంటారు. వారికి ఎక్స్‌రే, కట్టుడు పళ్ల సమస్యలు ఉంటే బయటకు పంపాల్సిన పరిస్థితి దాపురించింది. అన్నిరకాల దంతాలు, పరికరాలు ఉన్నా వాటిని అమర్చేవారు లేక ప్రజలు బయటకు వెళ్తున్నారు. ఇక్కడ టెక్నీషియన్లు లేరనే నెపంతో బయట ఫోన్ నంబర్ ఇచ్చి అక్కడకు పంపుతున్నట్లు ఆస్పత్రి వర్గాల్లో చర్చ సాగుతోంది. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా ఒక్క హిందూపురంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో డెంటల్ క్లినిక్ ల్యాబ్ ఉంది. మొదట్లో దంత వైద్యసేవలు బాగానే అందాయి. 18 నెలల నుంచి సేవలు బంద్ అయ్యాయి.


టెక్నీషియన్లను నియమిస్తే బాగుంటుంది

బయట దంతాలు కట్టించుకోవాలంటే రూ.30 వేలదాకా ఖర్చవుతుంది. దంతాలు అమర్చే టెక్నీషియన్‌ను ప్రభుత్వం నియమిస్తే ఆస్పత్రిలో ఉచితంగా అమర్చవచ్చు.

- భూపాలం విజయ్‌బాబు, దంత వైద్యుడు



సదా మీ సేవలో
అచిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతి కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!
ఈ ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు. పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు
అసిస్టెంట్ సర్క్యులేషన్ మేనేజర్ 95909 81234
ACO బెంగళూరు సౌత్ 77951 55585
SR బెంగళూరు ఈస్ట్ 88616 94202
SR బెంగళూరు నార్త్ వెస్ట్ 99009 22004
SR హొసూరు 86818 81386
ACO - బళ్ళారి 95027 41328
ఇట్లు: జనరల్ మేనేజర్



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,597.31	1,576.72
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	50,715	302
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	263	249
సామర్థ్యం (టీఎంసీలు)	18.25	3.08

చిత్తడిగా మారుతున్న మట్టి రోడ్లు

సిరుగుప్ప, జూలై 8: పట్టణంలో మట్టి రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. అభివృద్ధికి నిధులు విడుదల అవుతున్నా రోడ్ల దుస్థితి మారడంలేదని పట్టణవాసులు అంటున్నారు. నిధులు ఏ మేరకు ఖర్చుచేస్తున్నారు..? అంటూ ప్రశ్నిస్తున్నారు. వర్షం పడితే తమ పరిస్థితి అగమ్యగోచరంగా ఉంటోందని పట్టణవాసులు వాపోతున్నారు. నగరసభ అధికారులు ఇప్పటికైనా దృష్టిసారించి రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.



17వ వార్డులో బురదమయంగా మారిన రోడ్డు

నగరాభివృద్ధికి చర్యలు తీసుకోవాలి: బీఎన్‌హెచ్‌ఎస్

బళ్లారి సిటీ,జూలై 8: నగర అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని బళ్లారి నాగరిక పోరాట సమితి నాయకులు నగర మేయర్ ముల్లంగి నందీష్‌ను కోరారు. ఈ సందర్భంగా సమితి సంచాలకులు సోమశేఖర్‌గౌడ్ మాట్లాడుతూ జనాభాకు అనుగుణంగా అభివృద్ధి జరగడంలేదన్నారు. ప్రజా సౌకర్యాలు విస్తరించలేదన్నారు. మునిసిపల్ పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. నగరానికి పది కిలోమీటర్లలోపు రింగ్‌రోడ్డును నిర్మించాలని, రైల్వేక్రాస్‌పై వంతెన నిర్మించాలని, నగరంలోని అన్ని బ్యారక్‌లకు ప్రతి 3 రోజులకోసారి స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. తాగునీరు మురుగునీటిలో కలవకుండా నిరోధించాలని సూచించారు. ఏడాది కాలంగా నిరుపయోగంగా ఉన్న రాయల్ సర్కిల్ క్లాక్ పిల్లర్‌ను తక్షణమే ఉపయోగంలోకి తేవాలన్నారు. ట్రాఫిక్‌ను నియంత్రించాలన్నారు. మోతీసర్కిల్ రైల్వే ఫ్లైఓవర్ విస్తరణకు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షపు నీరు సజావుగా వెళ్లేందుకు డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలన్నారు. కాలువలను శుభ్రం చేయాలన్నారు. మురుగునీరు రోడ్డుపైకి రాకుండా చేయాలని, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. రిటైర్ ఇంజనీర్, ఉద్దిహాల్, రిటైర్డ్ లెక్చరర్ నరసన్న, గురురాజు, బాబు, చంద్రశేఖర్, నాగరత్న, డాక్టర్ ప్రమోద్, ముర్తుజా సాబ్, శాంతి తదితరులు మేయర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.



మేయర్‌కు వినతి పత్రం అందజేస్తున్న పోరాట సమితి సభ్యులు

రేబీస్‌పై అవగాహన

బళ్లారి సిటీ, జూలై 8: కుక్కకాటుకు గురైతే రేబిస్ వస్తుందని, దీనిపై అవగాహన కలిగివుండాలని డీహెచ్‌ఓ డాక్టర్ రమేష్ సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రపంచ జంతువ్యాధుల అవగాహన దినోత్సవాన్ని జిల్లా పంచాయతీ, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సర్వే విభాగం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేబీస్‌కు లూయిస్ పాశ్చర్ టీకాను కనుగొనడం జరిగిందన్నారు. పెంపుడు, వీధికుక్కలు కరిచిన వెంటనే ఆ స్థలాన్ని సబ్బుతో బాగా కడగాలన్నారు. సుమారు 15 నిముషాలపాటు కడిగి వెంటనే డాక్టర్‌ను సంప్రదించి ఇంజక్షన్ వేయించుకోవాలన్నారు. ఆరోగ్య, పశసంర్ధక, పశువైద్య శాఖ, మహానగరపాలిక, అటవీ, పట్టణాభివృద్ధి తదితర శాఖల సహకారంతో మానవ శరీరాలకు వ్యాపించే వైరస్‌లను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జంతువుల కాటుకు డిస్టంపర్ వ్యాక్సిన్ అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో లభిస్తోందన్నారు. కుక్కలు, పిల్లులు, పందులు తదితరాల ప్రవర్తనలో మార్పు ఉంటే వెంటనే పశుసంవర్ధక, పశువైద్యశాఖలకు సమాచారాన్ని ఇవ్వాలన్నారు. ర్యాబిస్, ఆంత్రాక్స్, లెప్టొస్పిరోసిస్, జపనీస్ మెదడువాపు, హెచ్1, ఎన్1 బ్రూసెల్లోసిస్ ఇన్‌ఫ్లూయెంజా తదితర వ్యాధులు సరైన సమయంలో చికిత్స పొందడం ద్వారా నయమవుతాయన్నారు. డాక్టర్ మరియంబి మాట్లాడుతూ పెంపుడు కుక్కలు, జంతువుల కాటుకు గురైతే తప్పనిసరిగా 5డోసుల ఇంజక్షన్లు వేసుకోవాలన్నారు. మొదటి రోజు 1వ డోసు, మూడోరోజు 2వ డోస్, 7వ రోజు 3వ డోస్, 14వరోజు 4వడోస్, 28వరోజు 5వ డోస్ వేసుకోవాల్సి ఉంటుందన్నారు. పెంపుడు జంతువులకు యజమానులు ఇంజక్షన్లు వేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



గోడ పత్రికలను విడుదల చేస్తున్న డీహెచ్‌ఓ డాక్టర్ రమేశ్



హైకోర్టుకు రాసిన లేఖలను పోస్టాఫీసులో అందిస్తున్న రైతులు

న్యాయం చేయాలని హైకోర్టుకు రైతుల లేఖలు

కంప్లి, జూలై 8: ఫ్యాక్టరీల కోసం సండూరులో భూములు ఇచ్చిన తమకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, న్యాయం చేయాలని హైకోర్టుకు జడ్జికి బాధిత రైతులు సోమవారం లేఖలను పంపారు. కుడితిని పోస్టాఫీసు వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ ధర్నా చేశారు. పోస్టాఫీసు అధికారికి లేఖలను అందించారు. అనంతరం సీఐటీయూ, రక్షణ వేదిక పదాధికారులు, మహిళా సంఘాల నాయకులు మాట్లాడుతూ కుడితిని, హరిగిణదోణి, జానెకుంటి, వేణివీరాపురం, ఎర్రంగళి తదితర గ్రామాల్లో ఫ్యాక్టరీల నిమిత్తం రైతుల నుంచి భూములను సేకరించారన్నారు. భూములు ఇచ్చిన రైతులకు తగిన న్యాయంచేస్తామని హామీ ఇచ్చిన ఫ్యాక్టరీలు ఇంతవరకు స్పందించిన దాఖలాలు లేవన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో తిప్పేస్వామి, జంగ్లిసాబ్, తిమ్మప్ప, సంపత్, సిద్దప్ప, హట్టి పంపాపతి, మంజునాథ్, వీరప్ప, నారాయణప్ప, దొడ్డ బసప్ప, పంపన్న, తాయప్ప, రామాంజినప్ప, దేవమ్మ, గంగమ్మ, బసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బళ్లారిలో పెరుగుతున్న డెంగీ కేసులు



బళ్లారి సిటీ, జూలై 8: డెంగీ కేసులు పెరగడంతో నగరవాసులు భయాందోళనకు గురవుతున్నారు. వర్షాలు రావడంతో విషజ్వరాలబారిన ప్రజలు పడుతున్నారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో బాధితులు ఎక్కువ సంఖ్యలో చేరుతున్నారు. మలేరియా, డెంగీ, చికున్‌గున్యా కేసులు పెరుగుతుండటంతో ఆందోళనకు గురవుతున్నారు. విషజ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో నియంత్రణకు వైద్యఆరోగ్యశాఖ అధికారులు జాగ్రత్తలకు శ్రీకారం చుట్టారు. జనవరి నుంచి ప్రస్తుతం వరకు 2800 మందికి డెంగీ పరీక్షలు నిర్వహించగా 83 మందికి నిర్ధారణైంది. బళ్లారి సిటీలో 21 కేసులు, తాలూకా 16, కురుగోడు 10, సిరుగుప్ప 25, సండూరు తాలూకాలో 11 కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు.

చెట్లు నరికితే చర్యలు తప్పవ్: సీఐ



శాంతిసభలో మాట్లాడుతున్న సీఐ వాసుకుమార్

కంప్లి, జూలై 8: చెట్లను నరికితే చర్యలు తీసుకుంటామని సీఐ వాసుకుమార్, ఏఎస్ఐ బసవరాజు హెచ్చరించారు. సోమవారం మొహర్రం పండుగ సందర్భంగా కంప్లి పోలీసు స్టేషన్‌లో విలేకరులతో వారు మాట్లాడారు. శాంతిసభ సందర్భంగా పట్టణంలోని 23వ వార్డు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మొహర్రం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలను చోటు చేసుకోరాదన్నారు. సమష్టిగా పండుగను జరుపుకోవాలన్నారు. ఆయా గ్రామాల నాయకులు, ప్రముఖులు బాధ్యత తీసుకోవాలన్నారు. హేమయ్యస్వామి, బట్టి ప్రసాద్, బ్రహ్మయ్య, మహబూబ్ తదితరులు వారి అభిప్రాయాలను పోలీసులకు తెలియజేశారు. శాంతిసభలో లడ్డూ వన్నూరువలీ, మస్తాన్, చంద్రశేఖర్ గౌడ, అయ్యప్ప, చిన్నరాజప్ప, దాదాసాబ్, గంగన్న, రుద్రప్ప, వెంకటేష్, రాజ్ కుమార్, మునాఫ్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీకి సన్మానం

బళ్లారి సిటీ, జూలై 8: ఎస్పీ శోభారాణిని ఆంధ్రకళా సమితి సోమవారం నాయకులు సన్మానించారు. ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఆమెను అధ్యక్షుడు ముల్లంగి చౌదరి, కార్యదర్శి భాస్కర్, సుహాన్, ట్రెజరర్ కొంగర రాజశేఖర్, చింబిలి ప్రకాశ్, ఫణి తదితరులు సన్మానించారు.



జిల్లా ఎస్పీ శోభారాణిని సన్మానిస్తున్న ఆంధ్రకళాసమితి సభ్యులు

సాగుదారులకు పట్టాలు ఇవ్వండి: ఏఐకేకేఎంఎస్



వినతి పత్రం సమర్పిస్తున్న ఏఐకేకేఎంఎస్

బళ్లారి సిటీ/రూరల్, జూలై 8: బళ్లారి తాలూకాలోని బగర్‌హుకుం సాగుదారులకు పట్టాలు పంపిణీ చేసేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని రైతు సంఘం ఏఐకేకేఎంఎస్ బళ్లారి తాలూకా భూ మంజూరు కమిటీ చైర్మన్ తిమ్మనగౌడకు వినతిచేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు గోవిందు మాట్లాడుతూ బళ్లారి తాలూకాలో సుమారు 59 నుంచి 60 ఏళ్లుగా ప్రభుత్వ భూమిలో సాగు చేసుకుంటున్న బగర్‌హుకుం రైతులకు ప్రభుత్వం హక్కుపత్రాలు అందజేస్తుందని హామీ ఇచ్చారు. దరఖాస్తులు స్వీకరించి దాదాపు ఏళ్లు గడుస్తున్నా పనులు నిదానంగా సాగుతున్నాయన్నారు. జీవనోపాధికి సంబంధించి రైతులకు భూమిలేదని, ఉన్న భూమికి హక్కు పత్రం లేకపోవడంతో వారికి ఎలాంటి ప్రభుత్వ, బ్యాంక్ సౌకర్యాలు అందడం లేదన్నారు. ఈ నేపథ్యంలో వెంటనే బగర్‌హుకుం సాగుదారులకు త్వరితగతిన హక్కు పట్టాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి గురల్లిరాజ, మల్లప్ప, ఆసుండి నాగభూషణ్, తిప్పయ్య, గాదిలింగప్ప, హనుమంతప్ప, యర్రిస్వామి, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

సండూరు అడవుల్లో అరుదైన జింక..!

కంప్లి, జూలై 8: జింక అనగానే రెండు పెద్ద పెద్ద కొమ్ములతో వుంటుందనుకుంటారు. కానీ సండూరు అడవుల్లో రెండురోజులుగా నాలుగు కొమ్ములతో వింతైన జింక అలరిస్తోంది. సండూరు తాలుకాలో ఈశాన్య అరణ్యంలో తిమ్మప్ప కొండ ప్రాంతంలో రోడ్డు దాటే సమయంలో వాహనదారులకు ఈ జింక కనిపించింది. ఎంతోమంది ఈ జింకను ఆసక్తిగా తిలకించారు. రెండు కొమ్ములతో పాటు నాలుగు కొమ్ములు కూడా ఉండడంతో అందరూ ఆసక్తిగా గమనిస్తున్నారు. వాటికి రక్షణ కల్పించి వాటికి ఆహారం, అన్ని సౌకర్యాలు కల్పించాలని అటవీశాఖ అధికారులను స్థానికులు కోరుతున్నారు.



నాలుగు కొమ్ములతో రోడ్డు దాటుతున్న జింక

పంచాయత్ రాజ్ డైరెక్టర్ మహ్మద్ యూసూఫ్ మృతి

రాయచూరు, జూలై 8 : రాష్ట్ర పంచాయత్ రాజ్ డైరెక్టర్‌గా పని చేస్తున్న మహ్మద్ యూసూఫ్ సోమవారం తెల్లవారు జామున గుండెపోటుతో మృతి చెందారు. బెంగళూరులోని ఆయన స్వగృహంలో అకస్మాత్తుగా ఆయన కుప్పకూలిపడిపోగా కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించడంతో అప్పటికే ఆయన మృతి చెందినట్లు డాక్టర్‌లు నిర్ధారించారు. పంచాయత్ రాజ్ శాఖలో రాష్ట్ర స్థాయి అధికారిగా ఇటీవల బెంగళూరులో బాధ్యతలు నిర్వహిస్తున్న మహ్మద్ యూసూఫ్‌కు జిల్లాతో అనేక ఏళ్ల అనుబంధం ఉంది. జిల్లా పంచాయతీ ఉప కార్యదర్శిగా సేవలందించిన ఆయన అంతకుపూర్వం మాన్వి తాలూకా పంచాయతీ కార్యనిర్వహణ అధికారిగా సేవలందించారు. దీంతో పాటు జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో ఆయనకు అనేక ఏళ్లుగా అనుబంధం ఉండడంతో పాటు జిల్లాలో గ్రామీణాభివృద్ధి కోసం ఆయన తీసుకున్న పలు కీలక నిర్ణయాలు అభివృద్ధికి దోహదం చేశాయని పలువురు అధికారులు ఆయన మృతి పట్ల విచారం చేస్తు వ్యాఖ్యానించారు.

బస్సుల కోసం ఎదురుచూపులు

సిరుగుప్ప, జూలై 8: తాలూకా వ్యాప్తంగా బస్సులను తగ్గించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్టీసీ బస్టాండులో బస్సుల కోసం పడిగాపులు కాస్తున్నారు. గంటల తరబడి బస్సుల రాకకోసం వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంటోంది. రాష్ట్రప్రభుత్వం ఉచిత బస్సు సేవలు అందిస్తామని హామీ ఇచ్చారని, అయితే బస్సులను తగ్గించడంతో తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలు కావడంలేదన్నారు. అదనపు బస్సులను కేటాయించాలని మహిళలు, ప్రయాణికులు కోరుతున్నారు.



బస్సు ఎక్కేందుకు ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

రైతు బీమా అక్రమాల్లో దోషులను తేల్చాలి: ఎమ్మెల్యే

రాయచూరు, జూలై 8 : గత ఏడాది ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకానికి సంబంధించి రైతు బీమా విడుదల చేయడంలో జరిగిన అక్రమాల్లో అసలు దోషులను గుర్తించాలని దేవదుర్గ ఎమ్మెల్యే కరెమ్మ నాయక్ అధికారులను కోరారు. సోమవారం దేవదుర్గలో నిర్వహించిన మాసిక కేడీపీ త్రైమాసిక సభకు అధ్యక్షత వహించి ఆమె మాట్లాడారు. బీమా చెల్లింపుల్లో జరిగిన అక్రమాలకు సంబంధించి అధికారులు కొద్దిమంది రైతుల పై కేసులు నమోదు చేయడాన్ని ఆమె తప్పుబట్టారు. ఇందుకు బీమా కృపనీ అధికారులతో పాటు వ్యవసాయ శాఖకు చెందిన ఉన్నతాధికారులు కూడా భాగస్వాములుగా ఉన్నారని వారి పాత్ర, ప్రమేయం లేకుండా అక్రమాలు జరిగే అవకాశమే లేదన్నారు. ఈ విషయంలో సమగ్ర విచారణ జరిపి దోషులను గుర్తించాలన్నారు. గడచిన రెండు నెలలుగా విచారణలో జరుపుతున్న జాప్యం పట్ల ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. కాగా సభలో మాట్లాడిన ఎమ్మెల్సీ శరణగౌడ పాటీల్ బయ్యాపూర్, పంటల బీమాకు సంబంధించి కొన్ని కంపెనీలు తమ టార్గెట్‌లను పూర్తి చేసుకునేందుకు రైతులను తప్పుదోహ పట్టిస్తున్నారని ఈ విషయంలో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు పూర్తి అవగాహన కల్పించే కార్యక్రమాలు చేయట్టాలని సూచించారు. కాగా తాలూకాలోని అరకెరా క్షేత్రలో తప్పా మిగితా అన్ని చోట్ల వర్షపాతం నమోదు తక్కువగా ఉందని అన్ని రైతు సంపర్క కేంద్రాల్లో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు సూచించారు. కాగా గత ఏడాది పంటనష్టానికి సంబంధించి 14560 మంది రైతులకు నష్ట పరిహారం అందజేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు సభకు వివరించారు.



మాసిక కేడీపీ త్రైమాసిక సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరెమ్మ నాయక్

పంటల బీమా నమోదుకు చర్యలు: ఏడీసీ

బళ్లారి సిటీ, జూలై 8: పంటల బీమా నమోదుకు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కలెక్టర్ మహ్మద్ జుబేరా వ్యవసాయ అధికారులను ఆదేశించారు. జిల్లా నూతన పాలనా మందిరంలో సోమవారం కర్ణాటక రైతు రక్షణ, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, ప్రగతి సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో వ్యవసాయ పనులు జోరందుకున్నాయన్నారు. రైతులందరూ పెద్దఎత్తున ఫసల్‌బీమా యోజన కింద నమోదు చేసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పంటల బీమాపై జిల్లాలో విస్తృత ప్రచారం చేయాలని అధికారులకు సూచించారు. పంటల బీమాను ప్రాధాన్యత అంశంగా పరిగణించాలన్నారు. రైతులు పంట నమోదు చేసుకునేందుకు బ్యాంకు గ్రామ వన్ ఎస్సీ కేంద్రాలను సంప్రదించవచ్చన్నారు. రైతులకు అవసరమైన సమాచారం అందించాలని తెలిపారు. వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు మల్లికార్జున, వ్యవసాయశాఖ ఉప సంచాలకులు కెంగేగౌడ, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు దయానందతోపాటు జిల్లా బ్యాంకు మేనేజర్ సహకార సంఘం ప్రతినిధులు, జిల్లా విలేజ్ వన్, సీఎస్‌సీ కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి యువకుడి మృతి

కంప్లి, జూలై 8: పట్టణంలోని 21వ వార్డు కొత్త హౌసింగ్ బోర్డులో ఉంటున్న వద్రు గోవిందప్ప కుమారుడు గోపాలకృష్ణ (33) సోమవారం పురుగుల మందు తాగి మృతి చెందాడు. ఈ మేరకు తండ్రి గోవిందు కంప్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గోపాలకృష్ణ బళ్లారి రోడ్డులోని విక్టరీ బార్ వద్ద కంప్యూటర్ షాపు నడుపుకునేవాడు. మద్యానికి బానిసయ్యాడు. పురుగుల మందు తాగడంతో మృతి చెందాడు. గమనించిన తల్లిదండ్రులు కుమారుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వాసుకుమార్ తెలిపారు.

మేయర్, బుడా అధ్యక్షులకు ఘన సన్మానం

బళ్లారి రూరల్, జూలై 8: నూతన మేయర్ ముల్లంగి నందీష్‌ను సోమవారం సన్మానించారు. నగరంలో 18వ వార్డు ఆంజనేయస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు ధనుంజయ, ఉపాధ్యక్షుడు భీమేష్ తదితరులు ముల్లంగి నందీష్‌ను అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రముఖులు వన్నప్ప, సత్యనారాయణ, నటరాజు, ప్రేమనాథ్, నాగేష్ కుమార్, వీరేష్, గిరి, హరీష్, రామాంజి, శ్రీరాములు, గంగాధర, లోకరాజు, తిరుమల సురేష్, శేషు, ట్రాన్స్‌పోర్ట్ మహేష్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



నూతన మేయర్ ముల్లంగి నందీష్, బుడా అధ్యక్షుడు ఆంజనేయులును సన్మానిస్తున్న 18వ వార్డు ప్రముఖులు

హోసూరు జోన్

నేటి నుంచి వృత్తి, నైపుణ్య అవగాహన కార్యక్రమం

హోసూరు (కృష్ణగిరి), జూలై 8: నేటి యువతలో ఉపాధి కల్పనను పెంపొందించేందుకు, వివిధ నైపుణ్య శిక్షణ ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని యువతలో నైపుణ్యాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు. వివిధ విద్యార్హతలు, పోటీ పరీక్షలు, ప్రైవేట్ రంగంలో ఉపాధి, పరిశ్రమల్లో స్వయం ఉపాధిపై అవగాహన కల్పించేందుకు, వృత్తి నైపుణ్య అవగాహన వారోత్సవాన్ని జూలై 9 నుంచి 15 వరకు నిర్వహించనున్నారు. కృష్ణగిరి జిల్లా ఎంప్లాయిమెంట్ అండ్ కేరీర్ గైడెన్స్ సెంటర్ ద్వారా పలు కెరీర్, స్కిల్ అవేర్‌నెస్ కార్యక్రమాలు నిర్వహించబోతున్నారు. కెరీర్ అవగాహన స్కిల్ వీక్ సందర్భంగా విభిన్న ప్రతిభావంతులు, మహిళలు, ఇంజనీరింగ్ కళాశాల పాఠశాలలు, ఆర్ట్స్, సైన్స్ కళాశాల, వృత్తి విద్యా శిక్షణా సంస్థ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు కేరీర్ గైడెన్స్ నైపుణ్యంపై అవగాహన ఇవ్వనున్నారు. తమిళనాడు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందులో పాల్గొనదలిచినవారు కృష్ణగిరి జిల్లా ఉపాధి, వృత్తి మార్గదర్శి కేంద్రాన్ని స్వయంగా లేదా 04343-291983 నెంబరుకు సంప్రదించాల్సి ఉంటుందని, అలాగే వెబ్‌సైట్ ద్వారా స్కిల్ ట్రైనింగ్‌కు సంబంధించిన వివరాలను తెలుసుకుని దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సరయు ప్రకటనలో తెలిపారు.

చోరీల కేసులో నిందితుల అరెస్ట్

హోసూరు(క్రైం), జూలై 8: హోసూరు సమీపంలోని బాగలూరు ప్రాంతంలో వరుసచోరీలు జరుగుతున్నాయి. ఈ వరుస చోరీలకు సంబంధించి కృష్ణగిరి జిల్లా ఎస్పీ తంగదురై ఆదేశాల మేరకు బాగలూరు పోలీసులు హోసూరు డీఎస్పీ బాబు ప్రసాంత్ ప్రత్యక్ష పర్యవేక్షణలో నిందితుల కోసం గాలిస్తున్నారు. ఈ పరిస్థితిలో బాగలూరు సమీపంలోని వెంకటేశపురం ప్రాంతంలో వీరు ఇంటి తాళాలను పగులగొట్టి చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. దీని తరువాత పోలీసులు జరిపిన తదుపరి విచారణలో శూలగిరి ప్రాంతానికి చెందిన మాదేశ్ (24), ఎల్లప్ప (31), కేశవన్ (22) గా గుర్తించి 9 పౌండ్ల బంగారు నగలు, పావు కిలో వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురి నిందితులను పోలీసులు కోర్టులో హాజరు పరచగా జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు.

రోడ్లపై పశుసంచారాన్ని నియంత్రించండి

హోసూరు, జూలై 8: హోసూరు పట్టణంలో ప్రధాన రహదారులపై పెద్ద సంఖ్యల్లో గేదెలు, ఆవులు, వీధికుక్కలు, పశువులు, సంచరిస్తుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. రాయకోట రోడ్డు చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిని కలిపి రింగ్ రోడ్డులో సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుపై గేదెల మంద ఇలా..

రోడ్డు పక్కనే ఆగిన స్పిరిట్ ట్యాంకర్లు

హోసూరు, జూలై 8: హోసూరు సమీపంలోని రాష్ట్ర సరిహద్దులో గత మూడు, నాలుగు రోజులుగా 50కుపైగా స్పిరిట్ ట్రక్కులు నిలిచిపోయాయి. హోసూరు సమీపంలోని జూజూవాడి చెక్‌పోస్టు వద్ద దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి స్పిరిట్‌తో వస్తున్న ట్రక్కులను అనుమతి లేకుండా నిలిపివేశారు. మిథనాల్ భారతదేశంలోని ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర వంటి వివిధ రాష్ట్రాల నుంచి హోసూరు మీదుగా తమిళనాడు, పాండిచ్చేరి, కేరళ ఈ ప్రాంతాల వరకు రవాణా చేయబడుతుంది. ఈస్పిరిట్ పెయింటింగ్ ఫ్యాక్టరీలు, బ్రూవరీలు, ఫార్మాస్యూటికల్ ఫ్యాక్టరీలకు సరఫరా అవుతోంది. హోసూరులో సమన్వయ విభాగం నుంచి అనుమతులు లేకపోవడంతో లారీ డ్రైవర్లు, ఆపరేటర్లు గత 3-4 రోజులుగా చాలా ఇబ్బందులు పడుతున్నారు.



వరుసగా ఆగిన స్పిరిట్ లారీలు ఇలా...

గ్రీవెన్స్ డేలో 242 వినతులు

● దివ్యాంగులకు వీల్ చెయిర్ల పంపిణీ

హోసూరు(కృష్ణగిరి) జూలై 8: కృష్ణగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పీపుల్స్ గ్రీవెన్స్ డేలో ప్రజలనుంచి 242 వినతులు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ కె.ఎం.సరయు అధ్యక్షత వహించి ప్రజల సమస్యలు ఆలకించారు. ఇళ్ల పట్టాలు, ఉచిత కుట్టుమిషన్‌లు, వృద్ధాప్య పింఛన్, రోడ్డు సౌకర్యం, విద్యుత్ కనెక్షన్ వంటి పలు డిమాండ్లపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం దివ్యాంగుల సంక్షేమ శాఖ తరపున ఒక్కొక్కరికి రూ.1,05,500 విలువైన రూ.7లక్షల 35 వేలతో కూడిన వీల్‌ఛైర్‌లను జిల్లా కలెక్టర్ అందజేశారు. 17 మంది దివ్యాంగులకు రూ.2.89 లక్షల మొత్తాన్ని అంత్యక్రియలకు అందించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎ.సాధనకురళ్, ప్రత్యేక సహాయ కలెక్టర్ (సామాజిక భద్రతా పథకం) పన్నీర్ సెల్వం, జిల్లా ఆది ద్రావిడ సంక్షేమ అధికారి రమేశ్, కుమార్, జిల్లా కలెక్టర్ ఇంటర్వ్యూ అసిస్టెంట్ సుందరరాజ్, దివ్యాంగుల సంక్షేమ అధికారి మురుగేశన్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



వీల్ చెయిర్లతో లబ్ధిదారులు

అభివృద్ధి పనులు చేపట్టాలి

హోసూరు, జూలై 8: హోసూరు రాయకోట రోడ్లలోని బ్రహ్మకొండ గుడి అభివృద్ధి చేపట్టాలని కోరుతూ కార్యవర్గ సమావేశంలో నిర్ణయించారు. ఆదివారం ఏర్పాటైన సమావేశానికి ప్రభాకరన్ అధ్యక్షత వహించి ఆలయ అభివృద్ధికి రోడ్డు సౌకర్యం కల్పించేందుకు కార్పొరేషన్ కౌన్సిల్ సభ్యుల సహకారంతో తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. పార్లమెంటు సభ్యుల సహాయంతో వెంటనే చర్యలు తీసుకోవాలి. రోడ్డు సౌకర్యం లభించిన తర్వాత బ్రహ్మకొండ ఆలయ విస్తరణకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఏకగ్రీవంగా తీర్మానాలు చేశారు. కార్యవర్గ సమావేశంలో హేమకుమార్, రాజేంద్రన్, మురుగన్, చిన్నప్ప, చంద్రశేఖరన్, సదాశివం, శశికళ, శక్తివేల్, సెల్వం, రాజు, చెల్లముత్తు, రాజు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ట్రస్టు సభ్యులు